RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 03 సంచిక : 331 ఆదివారం 03-03-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## టిడిపిలో చేరిన ఎమ్మెల్యే వసంత

కండువా కప్పి ఆహ్వానించిన బాబు

అమరావతి,మార్చి2: వైఎస్సార్సీపీకి గుడ్‌బై చెప్పేసిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ టీడీపీలో చేరారు. శనివారం ఉదయం టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్న వసంత కృష్ణ ప్రసాద్... అధినేత సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కృష్ణప్రసాద్‌తో పాటు మైలవరానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీలో తనకు ఎలాంటి గౌరవం దక్కలేదన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నదే తన కోరికన్నారు. ప్రజాగళం పేరుతో ఈ నెల 6 నుంచి చంద్రబాబు ఎన్నికల ప్రచార సభలు కాగా.. మైలవరం టీడీపీ టికెట్‌పై వసంత కృష్ణ ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని సర్వేల్లోనూ మైలవరంలో తానే గెలుస్తానని తేలిందన్నారు. జగన్ పలిచి టికెట్ నీకేనని చెప్పినా వద్దని వచ్చేసినట్లు తెలిపారు. చంద్రబాబు పోటీ చేయమంటే చేస్తానని లేకపోతే పార్టీ కోసం పనిచేస్తానని కృష్ణప్రసాద్ తేల్చిచెప్పారు.

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# గంటకు 250 కిమీ వేగంతో నడిచే రైళ్ల నిర్మాణానికి కృషి: రైల్వే మంత్రి

రానున్న ఏళ్లలో వెయ్యికి పైగా అమృత్ భారత్ రైళ్ల తయారీ

గంటకు 250 కిమీ వేగంతో నడిచే రైళ్ల నిర్మాణానికి కృషి

వందే భారత్ రైళ్ల ఎగుమతికీ యత్నం

వచ్చే ఐదేళ్లలో తొలి రైలు ఎగుమతి


రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన



న్యూఢిల్లీ: దేశంలో రానున్న సంవత్సరాలలో కనీసం వెయ్యి నవ తరం వందే భారత్ రైళ్లను తయారు చేయనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం ప్రకటించారు. గంటకు 250 కిలో మీటర్ల వేగంతో నడిచే రైళ్ల నిర్మాణానికి కృషి జరుగుతోందని మంత్రి వెల్లడించారు. మంత్రి పిటిఐ వీడియోస్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ, వందే భారత్ రైళ్ల ఎగుమతికి ప్రయత్నాలను రైల్వే శాఖ ఇప్పటికే ప్రారంభించిందని తెలియజేశారు. తొలి రైలు ఎగుమతి వచ్చే ఐదు సంవత్సరాలలో జరగగలదని ఆయన సూచించారు.గడచిన పది సంవత్సరాల నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో రైల్వే శాఖ తీసుకున్న పరివర్తన చర్యల గురించి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, రైల్వే రంగంలో చోటు చేసుకున్న గణనీయమైన సాంకేతిక మార్పులలో కొన్ని ప్రపంచంలో అత్యంత ఎత్తైన రైల్వే వంతెన (చీనాబ్ వంతెన), తొలి నదీ గర్భ నీటి సొరంగ మార్గం (కోల్‌కతా మెట్రో కోసం) అని తెలియజేశారు. ప్రస్తు బుల్లెట్ రైలు ప్రాజెక్టులో భాగంగా ముంబయి, థాణె మధ్య భారత్ తొలి సాగర గర్భ సొరంగ మార్గం నిర్మాణం ప్రారంభం గురించి కూడా మంత్రి మాట్లాడారు. అటువంటి టెక్నాలజీలు ఉన్న దేశాలు ప్రపంచంలో ఐదు మాత్రమే ఉన్నాయని ఆయన తెలిపారు.ముంబయి, థాణె మధ్య 21 కిలో మీటర్ల నిడివి ప్రతిపాదిత సొరంగ మార్గం సముద్రంలో 9.7 కిలో మీటర్ల దూరం, సాగర గర్భం కింద 54 మీటర్ల దూరం మేర సాగుతుందని ఆయన వివరించారు. రైల్వేల చార్జీల వ్యవస్థ, సాధారణ ప్రజాలకు రైల్వే సేవల గురించి కూడా వైష్ణవ్ మాట్లాడారు. 'మేము ఏటా దాదాపు 700కోట్ల మందిని, రోజూ 2.5 కోట్ల మందిని తీసుకువెళుతున్నాం. చార్జీల పద్ధతి ఎలా ఉంటుందంటే ఒక వ్యక్తిని తీసుకువెళ్లడానికి రూ. 100 చార్జీ ఉంటే మేము రూ. 45 వసూలు చేస్తుంటాం. అంటే సగటున రైల్వేల్లో ప్రయాణించే ప్రతి వ్యక్తికి 55 శాతం రాయితీ ఇస్తున్నామన్న మాట' అని మంత్రి తెలిపారు.రైల్వేల వార్షిక వ్యయం గురించి కూడా మంత్రి వైష్ణవ్ వివరించారు. పింఛన్లు, జీతాలు, ఇంధన బిల్లు, లీజ్ వడ్డీ చెల్లింపులు వరుసగా రూ. 55 వేల కోట్లు, రూ. 97 వేల కోట్లు, రూ. 40 వేల కోట్లు, రూ. 32 వేల కోట్లు అని ఆయన చెప్పారు. నిర్వహణపై మరి రూ. 12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, మొత్తం వ్యయం దాదాపు రూ. 2.40 లక్షల కోట్లు అవుతుందని మంత్రి తెలియజేశారు. 'మేము ఈ ఖర్చులు అన్నిటినీ ప్రధాని మార్గదర్శకత్వంలో బృందం తీవ్ర కృషి చేస్తుండడమే ఇందుకు కారణం' అని వైష్ణవ్ తెలిపారు. 'పది సంవత్సరాల క్రితం నాటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు రైల్వే స్టేషన్లు ఎంతో భిన్నమైనవి. ప్రతి రైలులో బయో టాయిలెట్ ఉంటున్నది' అని మంత్రి చెప్పారు. కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడంతో వందే భారత్ వంటి రైళ్లు యువత అమిత ఆదరణను చూరగొంటున్నాయని ఆయన తెలిపారు.'ప్రతి వారం ఒక వందే భారత్ రైలు సర్వీసు ప్రారంభం అవుతోంది. రానున్న కొన్ని ఏళ్లలో కనీసం 400 నుంచి 500 వందే భారత్ రైళ్లను తయారు చేయనున్నాం' అని వైష్ణవ్ తెలియజేశారు. రైలు మార్గాల విస్తరణ గురించి మంత్రి ప్రస్తావిస్తూ, 'నిరుడు 5200 కిలో మీటర్ల కొత్త మార్గం వేశాం. ఈ ఏడాది 5500 కిలో మీటర్ల కొత్త మార్గం వేస్తాం.

## హతవిధీ.. 40 ఇయర్స్ ఇండస్ట్రీకి ఎంత దుర్గతి పట్టింది...

అనకాపల్లి: హతవిధీ.. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీకి ఎంత దుర్గతి పట్టింది. పార్టీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతుండగా అసలే టీడీపీ పరిస్థితి దీనంగా ఉంది.దానికి తోడు జనసేనతో పొత్తు బెడిసికొట్టి ఉన్న నాయకులు, కార్యకర్తలు కూడా గోడ దూకేస్తున్న దుస్థితి. అందుకే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు 'కొత్త' నాటకానికి తెర తీశారు. కొత్త సీసాలో పాత సారా అన్నట్టు.. (పాత సీసాలో కొత్త సారా అనాలేమో) ఇప్పటికే పార్టీలో ఉన్న వారికి కండువాలు కప్పి కొత్తగా చేరినట్టు బిల్డప్ ఇస్తున్నారు.బుధవారం నాటి నాటకంలో పాత్రధారులు పాత కాపులే అన్న సంగతి తెలియడంతో అందరూ విస్తుపోతున్నారు. సిహెచ్.నాగాపురం గ్రామంలో అయ్యన్నపాత్రుడి సమక్షంలో వైఎస్సార్సీపీ నుంచి 10 మంది టీడీపీలో చేరినట్టు ప్రచారం చేశారు. తీరా చూస్తే టీడీపీ కండువాలు కప్పుకున్న వారంతా గతంలో తమ పార్టీకి చెందిన వారు కావడంతో స్థానిక తెలుగుదేశం నేతలు తలెత్తుకోలేని పరిస్థితి నెలకొంది.నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ ప్రభంజనాన్ని తట్టుకోలేక వేస్తున్న ఎత్తులతో నవ్వులపాలయ్యామని పార్టీ కార్యకర్తలే చెవులు కొరుక్కుంటున్నారు. సిహెచ్.నాగాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులే మళ్లీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో పార్టీలో చేరడం చాలా సిగ్గుచేటుగా ఉందని నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురాం ఎద్దేవా చేశారు.ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఉప్పులూరి రంగా, కులం రాము, కంకిపూడి మంగరాజు, చంటిబాబు టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని, వీరితో పాటు మరో నలుగురు 2019లో అయ్యన్నపాత్రుడు గెలుపు కోసం పనిచేసిన వ్యక్తులేనని తెలిపారు. వీరికే మళ్లీ టీడీపీ కండువాలు కప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఉప సర్పంచ్ సుబ్రమణ్యం తదితర్లు పాల్గొన్నారు.



# ఓడిపోయేందుకు జగన్ సిద్ధం



జనసేన-టిడిపిలతో వైసిపి షేక్

రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం

రాష్ట్రప్రయోజనాల కోసమే జనసేనతో పొత్తు

ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని దోచేసారు

ఎదిరించిన వారిని అడ్డంగా నరికేశారు

40 ఏళ్ల రాజకీయంలో ఇంత అరాచకం చూడలేదు

టిడిపిలో చేరిన వేమిరెడ్డిం దంపతులు

చేరిక సభలో టిడిపి అధినేత చంద్రబాబు విమర్శలు

నెల్లూరు,మార్చి2: రాష్ట్రంలో జగన్ అరాచక పాలన అంతమొందించేందుకు మనమంతా ఒక్కటి కావాల్సి ఉందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రప్రయోజనాల కోసమే జనసేనతో కలసి పొత్తులు పెట్టుకున్నామని, దీనిని కూడా వైసిపి జీర్ణించుకోవడం లేదన్నరు. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చి ఎపిని జగన్ దోచుకున్నారని మండిపడ్డారు. నెల్లూరు జిల్లాలో వైకాపా కీలక నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి తెదేపాలో చేరారు. తెదేపా అధినేత చంద్రబాబు సమక్షంలో వారిద్దరూ పసుపు కండువా కప్పుకొన్నారు. ఇటీవల వైకాపాకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రెడ్డితో పాటు నెల్లూరుకు చెందిన పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు తెదేపాలో చేరారు. నెల్లూరు పీవీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భారీగా తెదేపా-జనసేన కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అజాత శత్రువు. ఆయన.. ప్రజా సేవకు మారుపేరు. యుద్ధానికి సై అంటూ అంతా ముందుకొస్తున్నారు. వేమిరెడ్డి రాకతో సునాయాసంగా గెలవబోతున్నాం. ప్రజలకు సేవ చేసే ఏకైక ఉద్దేశంతోనే వేమిరెడ్డి పార్టీలోకి వచ్చారు. నెల్లూరు కార్పొరేషన్ మొత్తం ఖాళీ అయింది. పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నా. రాజకీయాలకు గౌరవం తెచ్చే వ్యక్తులను పార్టీలోకి స్వాగతిస్తున్నా. ప్రశ్నించిన వారిని వేధించడమే సీఎం జగన్ పనిగా పెట్టుకున్నారు. మనమంతా బానిసలం.. ఆయన రారాజు.. అనుకుంటున్నారు. ఎవరైనా ఆయన్ను వ్యతిరేకించినా.. చేసింది తప్పని చెప్పినా.. ఇక వారి పని అయిపోయినట్లే. అలా ప్రశ్నించినందుకే సొంత పార్టీ నేతలకు సైతం వేధింపులు తప్పలేదు. సీఎం జగన్ అవలంబిస్తోన్న తీరును చూస్తే చాలా బాధేస్తోంది. వ్యక్తులు, ప్రజాస్వామ్యానికి గౌరవం ఇచ్చే పార్టీ తెదేపా. అహంకారంతో ఇష్టానుసారం రాష్ట్రాన్ని నాశనం చేసిన వ్యక్తిని ఇంటికి పంపించాల్సిన సమయం వచ్చింది. ఆ బాధ్యత మన అందరిపైనా ఉంది. ఇది ఏ ఒక్కరి కోసమో కాదు. ఐదు కోట్ల ప్రజానీకం, భావితరాల భవిష్యత్తు కోసం జగన్‌ను గద్దె దించాలి. రాష్ట్రం, ప్రజలపై ఎలాంటి గౌరవం లేని వ్యక్తి సీఎంగా ఉండేందుకే ఏమాత్రం అర్హత లేదు. ఆయన విధానాలు నచ్చక వాళ్ల నేతలే పార్టీకి బైబై అంటున్నారు. కార్యకర్తలు తిరుగుబాటు చేసే పరిస్థితికి వచ్చారు. ఈ ముఖ్యమంత్రికి భంగపాటు తప్పదు. వెయ్యి శాతం చెబుతున్నా.. రాష్ట్రంలో రాబోయేది తెదేపా-జనసేన ప్రభుత్వమే' అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.ఇది ప్రారంభం మాత్రమే. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతోనే ఉద్ధృతమైన తిరుగుబాటు మొదలవుతుంది. వైకాపా నాయకులు రోడ్డుమీద తిరగాలంటే భయపడే పరిస్థితి వస్తుంది. ఇప్పటివరకు విశాఖను దోచేసిన వ్యక్తిని నెల్లూరుకు పంపిస్తున్నారు. అక్కడ మొత్తం ఊడ్చేశారు.. ఇప్పుడు నెల్లూరుకు వస్తే ఇక్కడా ఏమీ మిగలదు. తనకు ఎవరూ ఎదురు ఉండొద్దనే నియంతృత్వ ధోరణిలో జగన్ ముందుకెళ్తున్నారు. దోచుకున్న డబ్బుతో ఎక్కడ పడితే అక్కడ సిద్ధం.. సిద్ధం.. అని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మొదట్లో సిద్ధం అంటే అర్థం కాలేదు. ఆ తర్వాత ఆలోచిస్తే... ఓడిపోయేందుకే జగన్ 'సిద్ధం' అని అంటున్నట్లు అర్థమైందని చంద్రబాబు ఎద్దేవా చేశారు.ముఖ్యమంత్రి జగన్ విధానాలతో ప్రజల్లోనే కాదు, వైసీపీ కార్యకర్తల్లోనే తిరుగుబాటు మొదలైందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా అన్నారు. వెయ్యికి వెయ్యి శాతం టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇది ఆరంభం మాత్రమే అని.. ఎన్నికల కోడ్ వచ్చాక ఇంకా మార్పు వస్తుందని తెలిపారు. వైసీపీ రౌడీలని రోడ్లపై తరిమికొట్టే రోజులు వస్తున్నాయన్నారు. విశాఖపట్నాన్ని దోచేసిన వ్యక్తి విజయసాయిని నెల్లూరుకి పంపిస్తున్నారన్నారు. దోచుకున్న డబ్బుతో సిద్ధం అంటూ హోర్డింగులా? అంటూ మండిపడ్డారు. ఇన్నాళ్ల రాజకీయాల్లో ఎన్నడూ చూడలేదని.. దేనికి సిద్ధం... ఓడిపోవడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. 85 మంది జాబితా విడుదల చేసి కిందాపైనా పడుతున్నారు.

## వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోకు ముహూర్తం ఖరారు..


బాపట్ల 'సిద్ధం' వేదికగా సీఎం జగన్ ప్రకటన



ప్రకాశం: బాపట్ల జిల్లాలోని మేదరమిట్ల వద్ద సిద్ధం సభకు సంబంధించిన ఏర్పాట్లను వైఎస్సార్సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.ఇక, ఈ సభలోనే వైఎస్సార్సీపీ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ క్రమంలోనే సిద్ధం సభకు సంబంధించిన పోస్టర్‌ను వైఎస్సార్సీపీ నేతలు విడుదల చేశారు.ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ..'మేదరమిట్లలో సిద్ధం సభను ఈనెల పదో తేదీన నిర్వహిస్తున్నాం. ఈ సభలో నాలుగు సంవత్సరాల పదినెలల్లో మేము చేసిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన విషయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరిస్తారు. ఈ సభలోనే వైఎస్సార్సీపీ ఎన్నికల మేనిఫెస్టోను కూడా ప్రకటిస్తాం. గతంలో ఏం చేశాం.. రాబోయే కాలంలో ఏం చేస్తామో సీఎం జగన్ వివరిస్తారు.ఈ సిద్ధం సభకు 15లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నాం. సిద్ధం సభలకు ప్రజల నుంచి స్పందన బాగా ఉంది. ఒక దానిని మించి ఇంకో సభకు ప్రజలు పోటెత్తుతున్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్సార్సీపీ ఏం చేసిందో ప్రజలకు బాగా తెలుసు. బీసీల కోసం పాటుపడిందెవరో బీసీలకు బాగా తెలుసు. సిద్ధం సభకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సభను నిర్వహిస్తాం. మార్చి పదో తేదీ తర్వాత ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది' అని కామెంట్స్ చేశారు.

## మధ్యప్రదేశ్‌లో అడుగుపెట్టనున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'

భోపాల్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' శనివారం మోరీనా జిల్లా మీదుగా మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశించనుంది. ఐదు రోజుల విరామం తర్వాత, యాత్ర శనివారం రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ నుండి మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేష్ మీడియాతో మాట్లాడుతూ, ఐదు రోజులు (ఫిబ్రవరి 26 నుండి మార్చి 1 వరకు) విశ్రాంతి తీసుకున్న తర్వాత, మేము ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ నుండి భారత్ జోడో న్యాయ్ యాత్రను తిరిగి ప్రారంభిస్తున్నాము.ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు మధ్యప్రదేశ్‌లోని మోరేనాలో ప్రవేశిస్తాం, మార్చి 6 వరకు రాష్ట్రంలోనే ఉంటాం. మార్చి 5న ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయంలో రాహుల్ గాంధీ దర్శనం చేసుకోనున్నారు. మార్చి 7న గుజరాత్‌లోకి ప్రవేశిస్తాం. యాత్రలో ప్రజలు మాకు మద్దతు ఇస్తున్నారు. మార్చి 7న బన్స్వారా (దక్షిణ రాజస్థాన్‌లోని పట్టణం)లో రాహుల్ గాంధీ బహిరంగ సభలో



ప్రసంగిస్తారని, ఆ తర్వాత యాత్ర గుజరాత్‌లోకి ప్రవేశించి మార్చి 9 వరకు ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు రమేష్ చెప్పారు. అంతకుముందు శుక్రవారం, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ సింగ్ రాష్ట్రంలోకి ప్రవేశించే ముందు 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' కోసం సన్నాహాలను పరిశీలించడానికి మొరెనా చేరుకున్నారు. కాంగ్రెస్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' 15 రాష్ట్రాలలో 6,700 కిలోమీటర్లు ప్రయాణించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## టీఎంసీ అంటేనే అవినీతి: ప్రధాని మోదీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతిపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విమర్శలు చేశారు. బెంగాల్‌లో మొత్తం 42 సిట్లతో బీజేపీ విజయం సాధించాలనే లక్ష్యంతో టీఎంసీని ప్రధాని మోదీ టార్గెట్ చేశారు.ఆయన శనివారం బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. 'టీఎంసీ అంటేనే అవినీతి. ఇక్కడికి వచ్చిన ప్రజలు ఇచ్చిన విశ్వాసంతో చెబుతున్నా.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కార్ 400 స్థానాల్లో విజయం సాధిస్తుంది. టీఎంసీ అంటే దౌర్జన్యాలు, కుటుంబ రాజకీయం, దోహానికి ప్రతిరూపం. బెంగాల్ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పట్ల విసుగు చెందారు.సందేశ్‌ఖాలీ మహిళల విషయాన్ని ప్రస్తావిస్తూ... టీఎంసీ నేతలు సందేశ్‌ఖాలీ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని అన్నారు. బాధలో ఉన్న తల్లులు సోదరీమణులకు మద్దతు ఇవ్వాల్సింది పో?యి టీఎంసీ ప్రభుత్వం నిందితుల పక్షాన నిలబడుతోందని మోదీ విమర్శించారు. న్యాయం కోసం సందేశ్‌ఖాలీ మహిళలు ఎంత వేడుకుంటున్నా, నిరసనలు తెలిపినా టీఎంసీ ప్రభుత్వం మాత్రం వినిపించుకోలేదని మోదీ మండిపడ్డారు.



## సినిమా డైలాగులు చెప్పడానికే పవన్ పనికొస్తాడు: మంత్రి అంబటి

ప్రకాశం జిల్లా: పవన్ కల్యాణ్ రాజకీయాలకు పనికిరాడని.. సినిమా డైలాగులు చెప్పడానికే పనికొస్తాడంటూ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు.నాలుగో సిద్ధం సభతో టీడీపీ మూత పడటం ఖాయం అని, టీడీపీ నుంచి పోటీచేసే నాయకులే ఆలోచనలో పడతారన్నారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబుకు కాపులు మద్దతు ఇవ్వరని తేల్చి చెప్పారు. "తాడేపల్లి గూడెం సభతో టీడీపీ బలం ఏంటో తెలిసింది. అందుకే కాపులు వైఎస్సార్సీపీలో చేరుతున్నారు. మా టార్గెట్ 175కి 175" అని మంత్రి పేర్కొన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 03-03-2024

## గాలిలో ప్రజా ఆరోగ్య భద్రత

తినే తిండి, పీల్చేగాలి, తాగే నీరు సురక్షితంగా, నాణ్యంగా, ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోనివారుండరు. మనిషికి కనీస అవసరాలైన ఇందులోని ఏఒక్కటి కల్తీ అయినా అది ప్రాణాలకే ప్రమాదం..ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నిత్యావసర వస్తువులను కృత్రిమంగా తయారు చేసి.. కల్తీని ప్రజలకు విక్రయిస్తున్నారు. మరోపక్క నగరంలోని హోటళ్లలో కూడా కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. కల్తీ ఆహారపదార్థాల బారిన పడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా.. అధికార యంత్రాంగం నిద్ర మత్తులో ఉన్నదని విమర్శలొస్తున్నాయి. నకిలీ కొబ్బరి నూనె, మసాల, కిరాణా సరకులకు సంబంధించిన గుట్టును రట్టు చేశారు. కానీ, స్వార్థమే పరమావధి, లాభాలే అసలైన లక్ష్యంగా మారిన సమాజంలో సర్వం కల్తీమయం చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. ఆహారపదార్థాల్లో ఉపయోగించే మసాల దినుసుల్లోని గసగసాలు, మిర్యాలు, లవంగాలు, డ్రైఫ్రూట్స్, పిండి, బియ్యం.. అన్ని రకాల వస్తువులు నకిలీవి చేస్తున్నారు.మానవాళికే ప్రమాదకరంగా మారిన ఈ కల్తీని సమర్థవంతంగా నిరోధించి, కల్తీసురుల ఆటకట్టించే చట్టాలే కరువయ్యాయి. కోటికి పైగా జనాభా వున్న హైదరాబాద్‌లో గడిచిన రోజు ఓ అంతర్జాతీయ ప్రముఖ కంపెనీ చాక్లెట్‌లో తెల్లపురుగు వుందని నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాల నిర్ధారించడం, బేగంబజార్ కేంద్రంగా రూ. 5 లక్షలు విలువ చేసే అల్లం, వెల్లుల్లి కల్తీ పేస్టు ముఠాను పట్టుకోవడం సర్వం కల్తీమయాన్ని నిరూపిస్తున్నది.నేషనల్ క్రైమ్స్ బ్యూరో ఇటీవల 19 నగరాల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేయగా హైదరాబాద్ దేశంలోనే 246 కేసులతో అగ్రస్థానంలో నిలిచిందని, ఇది దేశ వ్యాప్త కేసుల్లో 84 శాతమని బ్యూరో గణాంకాలతో సహా ప్రకటించడం ఆరోగ్యరంగ నిపుణులను ఆందోళనపరుస్తోంది. ఇంటి బయట ఏది తినాలన్నా కల్తీ భయం సాధారణ ప్రజలను తీవ్రంగా కలవరపరుస్తున్నది. అత్యధిక జనసాంద్రత, వేలాది హోటళ్ళున్న హైదరాబాద్‌లో ఆహార కల్తీని నిరోధించే అధికారులు కేవలం 30 మంది మాత్రమే ఉన్నారంటే నియంత్రణ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సర్వం కల్తీతో పాలితులు కల్తీ ఆహారం తిని కడుపు సంబంధిత వ్యాధులు, కేన్సర్, డయాబెటిస్, గుండె వైఫల్యం, పెరాలసిస్ వంటి సుదీర్ఘ జబ్బులతో బాధితులుగా మారినా పాలకుల్లో ఆహార కల్తీ నియంత్రణపై చీమకుట్టినట్లయిన లేకపోవడం, అధికారులు మౌన ప్రేక్షకుల్లా మూగనోము పాటించడం క్షమించరాని నేరమే. 2006లోనే ఆహార భద్రత, ప్రమాణాల చట్టం తీసుకు వచ్చినా అది కాగితాలకే పరిమితమైంది. వీధి ఆహార దుకాణాల నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ళ దాకా కల్తీసురులు చట్టంపై భయంలేక విశృంఖలంగా వీరవిహారం చేస్తున్నారు.సహజ సిద్ధంగా పొలాల్లో పండిన పంటల నుంచి వచ్చే ఆహార పదార్థాలను తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అయితే, ఈ సహజ సిద్ధంగా పండే పంటల నుంచి వచ్చే ఆహారపదార్థాలు కాకుండా.. కొందరు కృత్రిమంగానే తయారు చేస్తున్నారు. ఇందుకు కొన్ని కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నారు, హైడ్రోజన్ ఫెరాక్సైడ్ వంటి కెమికల్స్‌ను కలిపి.. ఈ నకిలీ వస్తువులు తయారు చేస్తున్నారు. జిలకర్ర, సాజిర, బాదం, లవంగాలు, ఇలాచీలు, గసగసాలు, మిర్యాలు, కర్రం పొడి, పసుపు, గోదుమ పిండి, నూడిల్స్.. ఇలా ఒకటేమిటి ఇంటిలోని వంట గదిలో ఉండే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే వస్తువులన్నీ నకిలీవి తయారు చేస్తున్నారు. మేమున్నామంటూ.. అప్పడప్పుడు పోలీసులు దాడులు చేస్తుంటారు. ఏడాదికోసారి ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా.. మేం సైతం.. అంటూ దాడులు చేస్తుంటారు. పూర్తిస్థాయిలో మాత్రం అటు పోలీసులు, ఇటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన వాళ్లే కృత్రిమంగా నకిలీ పదార్థాలు తయారు చేస్తూ.. విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీకి వాడిన నాసిరకం ముడిపదార్థాలు, వాటికి రంగు, రుచి, వాసన రావడానికి వాడిన కెమికల్స్, అవి తయారైన పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తే ఒళ్ళుగగుర్పొడుస్తోంది. కల్తీ తయారీదారులు అల్లం, వెల్లుల్లి పేస్టును బ్రాండ్ల పేరు, ఐఎస్ఐ ముద్రతోనే రాష్ట్ర వ్యాప్తంగా పేరున్న స్టోర్లకు కూడా పంపిణీ చేస్తున్నారని పోలీసులు చేసిన ప్రకటన చూస్తే వణికిపోని వారుండరంటే అతిశయోక్తి కాదు. పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, వెన్న, మయోనీజ్, సాస్, కోవా, బియ్యం, చాక్లెట్లు లాంటి నిత్యావసర వస్తువుల నాణ్యతపై హైదరాబాద్ నగర పాలక సంస్థ ఆహార కల్తీ నిరోధక విభాగానికి ప్రతి రోజూ వందలాది ఫిర్యాదులు అందుతున్నాయంటే కల్తీ తీవ్రత ఎంతగా విస్తృతమవుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఆహార కల్తీని కూడా విధాన నిర్ణేతలు ప్రాధాన్యతా అంశంగా తీసుకొని వివిధ దేశాల్లో ఆదర్శప్రాయంగా వున్న చట్టాలను అక్కడి మాదిరిగా సంస్కరించి కఠిన శిక్షలు కల్తీసురులకు పడే విధంగా చూస్తే తప్ప కల్తీల ఆగడాలు ఆగవు.ఆహార కల్తీ చట్టం, అందులో భాగంగా ఏర్పాటైన యంత్రాంగాలు వీధివీధినా పెరిగిన ఆహార కేంద్రాలను ఎప్పటికప్పుడు నిఘా పెట్టి తనిఖీ చేసే పరిస్థితులు లేవు. పాలకులే మేల్కొని ఆహార కల్తీ నిరోధాన్ని అత్యవసరంగా తీసుకొని అందుకు తగిన కఠిన కార్యాచరణ అవలంబిస్తే తప్ప కల్తీ మహమ్మారిని పారద్రోలలేము. ఇప్పుడు సరైన యంత్రాంగం లేక అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఆహార కల్తీ నిరోధక అధికారులు చేసే తనిఖీలు, పెట్టే కేసులు తూతూ మంత్రంగానే వున్నాయి. ఎక్కడా కేసులు పెట్టకపోవడం, పెట్టినా శిక్షలు నామమాత్రంగా కూడా లేకపోడవడంతో కల్తీ అనేది కుటీర పరిశ్రమగా మారింది. లాభమే తప్ప మనిషి ఆయుష్షుని పట్టించుకోని పరిస్థితి సర్వత్రా నెలకొన్నది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటి బయట ఉత్పత్తి అయ్యే ప్రతి పదార్థం లోని వాటిని ముడి పదార్థాలు, వాటి వల్ల ఆరోగ్యానికి సంభవించే లాభనష్టాలు లాంటివి పకడ్బందీగా ప్యాకింగ్‌లోనే ముద్రిస్తారు. ఆహార చట్టాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి శిక్షలు కూడా త్వరిత గతిన పడేలా యంత్రాంగాలను ఏర్పాటు చేశారు. దీనితో అక్కడ కల్తీకి కొంత ముకుతాడు పడింది. కాని ఆ చిత్తశుద్ధి ఇక్కడ లేకపోడం ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారింది.

## ఏపీలో బీజేపీ ఒంటరి పోరా..




విజయవాడ, మార్చి 2 ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ రాజకీయాలు రసకందాయంలో పడుతున్నాయి. ఏపీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసే ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ శివార్లలో పార్టీ కీలక నేతలు సమావేశమై ఇందుకు సంబంధించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి వచ్చిన కొంత మంది నేతలు.. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సహా ఏపీకి చెందిన పలువురు నేతలను కలిసి ఈ అంశంపై చర్చించినట్లు సమాచారం. ఏపీలో బీజేపీ–టీడీపీ–జనసేన కలిసి పోటీ చేస్తాయని భావిస్తుండగా.. తాజా పరిణామం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.టీడీపీ–జనసేన కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జాబితా విడుదల చేయడమే కాకుండా, ఉమ్మడిగా బహిరంగ సభలు కూడా నిర్వహిస్తున్నారు. మరోవైపు.. బీజేపీ కూడా తమతో కలిసి పనిచేస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కొంత కాలంగా దీమాగా చెబుతూ వస్తున్నారు. అంతేకాదు, టీడీపీతో కలిసి పనిచేసేందుకు ఢిల్లీ పెద్దలను ఒప్పించడానికి తాను తిట్లు కూడా తినాల్సి వచ్చిందంటూ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు.ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ ఒంటరిగా పోటీ చేయాలని భావించడం అటు జనసేనకు, ఇటు టీడీపీకి పెద్ద దెబ్బే అవుతుంది. అంతేకాదు.. టీడీపీ, జనసేన నుంచి వచ్చే నేతలను, టికెట్లు రాని వారిని తమ పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలకు 25 ఎంపీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర నాయకత్వానికి బీజేపీ అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది.ఇప్పటికే బీజేపీ పెద్దలతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తుల అంశంపై పలుమార్లు చర్చించారు. ఈ చర్చలు ఓ కొలిక్కి రాకముందే జనసేన–టీడీపీ కలిసి 99 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం బీజేపీ అధిష్టానానికి ఆగ్రహం తెప్పించిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.బీజేపీ జాతీయ నేత శివప్రకాశ్‌జీ నేతృత్వంలో హైదరాబాద్ నగర శివార్లలో సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ భేటీకి ఏపీ నుంచి 10 మంది ముఖ్య నేతలను మాత్రమే ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఏపీ ఎన్నికలకు సంబంధించి పొత్తులు సహా వివిధ ప్రత్యామ్నాయాలపై సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం. పొత్తులే కాకుండా, సొంతంగా బలపడేందుకు వ్యూహాలను రచించాలని పార్టీ నేతలకు శివప్రకాశ్‌జీ సూచించినట్లు తెలుస్తోంది.పొత్తుకు బీజేపీ ఆశీస్సులు ఉన్నాయని పవన్ కళ్యాణ్ చెబుతూ వస్తున్నారు. ఒకవేళ బీజేపీ ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంటే.. టీడీపీ–జనసేన కూటమి పరిస్థితి ఏమిటి? పవన్ కళ్యాణ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? బీజేపీ విడిగా పోటీ చేస్తే, అది ఎవరికి నష్టం? అనేవి చర్చనీయాంశాలుగా మారాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ మొదటి వారంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పొత్తుల అంశంపై బీజేపీ త్వరలోనే ప్రకటన చేసే అవకాశం ఉంది.

## అనంతలో తమ్ముళ్లు చివరి ప్రయత్నాలు

అనంతపురం, మార్చి 2 ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ నేతలకు టికెట్ టెన్షన్ నెలకొంది. ఇప్పటికే ఆ పార్టీ అధినేత చంద్రబాబు జిల్లా వ్యాప్తంగా 70 శాతం మంది అభ్యర్థులను ఖరారు చేశారు. మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, 2 పార్లమెంట్ స్థానాలుండగా.. తొలి జాబితాలో 8 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేశారు. దీంతో మిగిలిన నియోజకవర్గాల్లో ఎవరిని ప్రకటిస్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. తెలుగుదేశం, జనసేన కూటమిలో అభ్యర్థులు ఎవరన్నది ఇంకా స్పష్టత లేకపోవడంతోనే మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించడం లేదని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. టీడీపీ – జనసేన కూటమి, బీజేపీతో పొత్తు కుదిరితే జిల్లాలో కొన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేసే అవకాశం కూడా ఉంది. దీనికి అనుగుణంగానే జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఆయా పార్టీలకు సంబంధించిన నేతలు వారి అధినేతల ముందు వారి బయోడేటా ఉంచి తమకి టికెట్లు కేటాయించాలని పట్టుబడుతున్నారు. ఈ క్రమంలోనే రెండో జాబితాపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రాప్తాడు, హిందూపురం, పెనుగొండ, తాడిపత్రి, ఉరవకొండ, మడకశిర, రాయదుర్గం, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గం అభ్యర్థులు ఖరారు కాగా.. మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించలేదు. అనంత అర్బన్ ఇంఛార్జిగా ఉన్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి మొదటి లిస్టులో తన పేరు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ స్థానంపై జనసేన నేతలు కూడా తీవ్ర ఆశలు పెట్టుకున్నారు. ఈ మేరకు జనసేనాని పవన్ పై వారు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అర్బన్ నియోజకవర్గంలో బలిజ సామాజిక వర్గం ఎక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతంలో చంద్రబాబు కదిరి పర్యటనలో మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ను ఆశీర్వదించాలని ప్రజలని ఉద్దేశించి ప్రసంగించారు. దీంతో దాదాపుగా కదిరి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆయన ఖరారైనట్లు తేలిపోయింది. అనూహ్యంగా మొదటి జాబితాలో కందికుంట వెంకటప్రసాద్ పేరు లేకపోవడంతో అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇప్పటికే అక్కడ వైసీపీ ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఈనయ్ తుల్లను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో సామాజిక సమీకరణాల నేపథ్యంలో తెలుగుదేశం కూడా ముస్లిం నేతనే బరిలోకి దించాలని ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.అటు, గుంతకల్లు నియోజకవర్గం ఇంఛార్జిగా ఉన్న జితేంద్ర గౌడ్ తనకే టికెట్ వస్తుందని ధీమాగా ఉన్న తరుణంలో తొలి జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అటు, మంత్రి గుమ్మనూరు జయరాం వైసీపీని వీడుతారన్న ప్రచారం ఊపందుకున్న క్రమంలో ఆయన కూడా టీడీపీ తరపున ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. ఆయన గత కొంతకాలంగా వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అటు, బీసీ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న గుంతకల్లు నియోజకవర్గంలోనూ అభ్యర్థి ఖరారు విషయంలో ఉత్కంఠ నెలకొంది. ప్రశాంతతకు మారుపేరైన పుట్టపర్తి నియోజకవర్గంలోనూ రాజకీయ వేడి పెరిగింది. నియోజకవర్గంలో అన్ని తానై చూసుకునే మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి టికెట్ రాదనే ప్రచారం జరుగుతోంది. తొలి జాబితాలో ఆయన పేరు లేదు. అయితే, వడ్డే సామాజిక వర్గానికి చెందిన మరో నేత కూడా టీడీపీ నుంచి పుట్టపర్తి టికెట్ ఆశిస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. పల్లె రఘునాథ్ రెడ్డికే పుట్టపర్తి టికెట్ ఇస్తారా లేక వారి కుటుంబ సభ్యులకు కేటాయిస్తారా.? అనే దానిపై రెండో జాబితాలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.రాష్ట్రంలోనే చర్చనీయాంశంగా ఉన్న ధర్మవరం నియోజకవర్గంలో ఈసారి ఎవరు పోటీలో ఉంటారా అనేది ఉత్కంఠగా మారింది. 2019 ఎన్నికల అనంతరం మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి టీడీపీని వీడి బీజేపీ కండువా కప్పుకొన్నారు. ఈ నియోజకవర్గానికి పరిటాల శ్రీరామ్ ను ఇంఛార్జిగా చంద్రబాబు నియమించారు. ప్రస్తుతం ఆ టికెట్ ను మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సైతం ఆశిస్తున్నారు. దీంతో శ్రీరామ్ కు టికెట్ గండం పొంచి ఉందనే ప్రచారం సాగుతోంది. అయితే, గోనుగుంట్ల ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారో ఇంకా స్పష్టత లేదు. జనసేన టీడీపీ కూటమితో బీజేపీ పొత్తు కుదిరితే ధర్మవరం టికెట్ ను బీజేపీ తరపున గోనుగుంట్లకు కేటాయిస్తారనే ప్రచారం జోరందుకుంది. మరోవైపు, టీడీపీ నుంచి కూడా పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ చంద్రబాబు రెండో జాబితా విడుదల చేసేంతవరకు ఈ నియోజకవర్గాల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపించటం లేదు. నియోజకవర్గాల్లో నేతలు మాత్రం ఎవరికి వారు టికెట్ తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్నికల బరిలోకి... సునీత...?



కడప, మార్చి 2 వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు 2019 ఎన్నికల సమయంలో కీలక అంశంగా ఉంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే సమయంలో హత్య జరిగింది. అప్పటికే చీఫ్ సెక్రటరీతో పాటు డీజీపీ, ఇంటలిజెన్స్ చీఫ్‌లను కూడా ఈసీ బదిలీ చేసింది. కడప ఎస్పీని కూడా మార్చేశారు. దీంతో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నిస్సహాయుడయ్యారు. తర్వాత ఓడిపోయారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చారు. వివేకా హత్య కేసులో చంద్రబాబుపైనే వైసీపీ ఆరోపణలు చేసింది ఈ ఎన్నికల్లోనూ అదే అంశం హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటి వరకూ నిందితుల్ని పట్టుకోలేకపోవడతో పాటు సీబీఐ విచారణకు ఆదేశించినా పురోగతి లేకపోవడంతో.. ప్రజామద్దతు, ప్రజా తీర్పు కావాలని.. ప్రజల ముందుకు వెళ్లేందుకు వివేకా కుమార్తె సునీత సిద్ధమయ్యారు. తన తండ్రి వివేకానందరెడ్డిని చంపేసి తాను రాక ముందే అంత్యక్రియలు చేయాలనుకున్న వారిని వదిలి పెట్టేది లేదని షర్మిల అంటున్నారు. ఎన్ని ఒత్తిళ్లకు గురైనా ఆమె నితంతర పోరాటం చేస్తున్నారు. న్యాయస్థానంలోనూ ఆమెకు ఊరట లభించలేదు. అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ పై సుప్రీంకోర్టులో వాదనలు కూడా జరగడం లేదు. ఇదే సమయంలో మరోసారి ఎన్నికలు ముంచుకొచ్చేశారు. ఈ సమయంలో ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టిన సునీతా రెడ్డి సోదరుడు జగన్ పై కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డిని కూడా సీబీఐ ప్రశ్నించాలని కోరుతున్నారు. అంతే కాదు జగన్ మోహన్ రెడ్డి పార్టీకి ఓటేయవద్దని కూడా పిలుపునిచ్చారు. సునీత ప్రెస్ మీట్ ఏపీ రాజకీయాల్లో సంచలనం అయింది. ఢిల్లీలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సునీత ప్రజా తీర్పు , ప్రజల మద్దతు కావాలని అడిగారు. ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యానని తెలిపారు. అయితే ఏ రూపంలో వెళ్లాలో ఇంకా నిర్ణయించుకోలేదన్నారు. కానీ సునీత ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. షర్మిల ఏపీ పీసీసీ చీఫ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె కూడా కాంగ్రెస్ లోకి వెళ్తారని అనుకున్నారు. ఈ దిశగా ఓ సారి చర్చలు కూడా జరిపారు. కానీ కాంగ్రెస్ లో చేరికపై ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేయడం కన్నా స్వతంత్రంగా పోటీ చేస్తే అందరి మద్దతు లభిస్తుందన్న అంచనాలో ఉన్నారని అటున్నారు. ఓ పార్టీ తరపున బరిలోకి దిగితే ఇతర పార్టీలు మద్దతు ఇవ్వవు. వివేకానందరెడ్డి హత్య విషయంలో జగన్మోహన్ రెడ్డి నిందితుల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అన్ని పార్టీలు విమర్శిస్తున్నాయి. పైగా ప్రధాన నిందితుడిగా ఆరోపిస్తున్న అవినాష్ రెడ్డి ఎంపీగా బరిలోకి దిగే అవకాశం ఉంది. అందుకే సునీత లేదా ఆమె తల్లి అక్కడి నుంచి స్వతంత్రంగా పోటీ చేస్తే బాగుంటుందని అప్పుడు ప్రజలు నిందితుల వైపు లేరని.. బాధితుల వైపే ఉన్నారని అర్థమవుతుందని భావిస్తున్నారు. వైఎస్ వివేకానందరెడ్డి ఉన్నంత కాలం ఎప్పు?డూ వైఎస్ సునీత రాజకీయాల జోలికి రాలేదు. ఆమె వైద్యురాలు. హైదరాబాద్‌లో ఓ ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రిలో పని చేస్తూ ఉంటారు.

## గంజాయి చాటున మిరప

అనంతపురం, మార్చి 2 మిరప చేను మాటున గంజాయి సాగు చేస్తున్నాడు రైతు. పక్కా ప్లాన్‌తో నిర్వహించిన ఆపరేషన్‌లో అసలు యవ్వారం వెలుగులోకి వచ్చింది.వ్యవసాయంలో నష్టాలు వచ్చేటప్పుడు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు ఓ రైతుకు వేరేలా అర్థమైంది. ఇక వ్యవసాయం దండగ అనుకున్నాడో.. ఏమో..! గంజాయి సాగు చేస్తూ పండగ చేసుకుంటున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం మందలపల్లి గ్రామంలో హనుమంతరాయప్ప అనే రైతు మిరప తోటలో గంజాయి సాగు మొదలుపెట్టాడు. హనుమంతరాయప్ప తన పొలంలో వక్క, మిరప తోట ముసుగులో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్న హనుమంతురాయప్ప బండారాన్ని తోటి రైతులే బయటపెట్టారు.రోజూ మిరప చేనుకు వెళ్లి గంజాయి మొక్కలకు నీళ్లు పెడుతున్న హనుమంతరాయప్ప వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన చుట్టుపక్కల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు? పక్కా సమాచారంతో సెబ్ అధికారులు హనుమంత రాయప్ప గంజాయి సాగు చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మిరప తోట మధ్యలో ఎవరికీ అనుమానం రాకుండా 13 గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు అధికారులు గుర్తించారు. రైతు హనుమంతరాయప్ప చేత 13 గంజాయి మొక్కలను పీకించి, అతనిపై కేసు నమోదు చేశారు సెబ్ అధికారులు. పత్తి, మిరప చేలలో అంతర్ పంటగా కందులు, మినుములు వేయడం చూశా. కానీ మిరప తోటలో అంతర్ పంటగా గంజాయి సాగడాన్ని ఇదేందయ్యా ఇది.. మేము ఎక్కడా చూడలేదు అంటున్నారు తోటి రైతులు. నిందితుడిని అరెస్ట్ చేసిన సెబ్ అధికారులు రిమాండ్‌కు తరలించారు.

## 6 నుంచి ప్రజల్లోకి సీబీఎన్

విజయవాడ, మార్చి 2 తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆరు పదుల వయసులోనూ విశ్రాంతి ఎరుగక పార్టీ కేడర్ ను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో రా కదలిరా పేరుతో సభలు నిర్వహిస్తున్న చంద్రబాబు.. ఈనెల ఆరో తేదీ నుంచి మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రజాగలం పేరుతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. మార్చి ఆరో తేదీన ప్రారంభం కానున్న ఈ సభలు వరుసగా ఐదు రోజులుపాటు ఐదు ప్రాంతాల్లో భారీ ఎత్తున నిర్వహించేందుకు పార్టీ ఏర్పాటు చేస్తోంది. ప్రజాగలం పేరుతో చంద్రబాబు నాయుడు నిర్వహించనున్న ఈ సభల్లో ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడంతోపాటు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగానే ఐదు రోజులపాటు భారీ ఎత్తున ప్రజాగలం కార్యక్రమాన్ని అనేక ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. ప్రజాగలం కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వైసిపి బలంగా ఉన్న స్థానాల్లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీకి బలమైన స్థానాలను లక్ష్యంగా చేసుకొని ఈ సభలను ఏర్పాటు చేయడం ద్వారా అక్కడ ఉన్న తెలుగుదేశం పార్టీ కేడర్ ను ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభ విజయవంతమైందని ఇరు పార్టీలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు మరో వినూత్న కార్యక్రమం చేపట్టి ప్రజల్లోకి వెళ్లడం ద్వారా కూటమికి వస్తున్న ప్రజాధరనను కొనసాగించే ఉద్దేశంలో ఆయన ఉన్నట్లు చెబుతున్నారు. ఈ సభల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా పాలుపంచుకునేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. బిజెపి కూడా కూటమిలో చేరితే ప్రజాగళం సభల్లో బిజెపి నాయకులు కూడా పాల్గొననున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న రా కదలిరా సభలు ఈ నెల నాలుగో తేదీతో రాప్తాడులో ముగియనున్నాయి. ఒక్కరోజు విరామం తీసుకుని ఆరో తేదీ నుంచి ప్రజాగళం కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఐదు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రజాగళం పేరుతో చంద్రబాబు నిర్వహిస్తున్న కార్యక్రమం కర్నూలు జిల్లా నంద్యాలలో తొలిరోజు ఏర్పాటు చేయబోతున్నారు. ఉదయం కర్నూలులో పూర్తయిన వెంటనే మధ్యాహ్నం మైదుకూరులో మరో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు భారీ ఎత్తున ప్రజలు వచ్చేలా తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా పార్టీ కేడర్ కు ముఖ్య నాయకుల నుంచి సమాచారాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే 25 పార్లమెంటు స్థానాల పరిధిలో నిర్వహించిన రా కదలిరా సభలు విజయవంతం కావడంతో.. ప్రజా గళం కార్యక్రమాన్ని కూడా అంతే స్థాయిలో విజయవంతం చేయడంపై పార్టీ నాయకులు దృష్టి సారించారు. ఇప్పటికే పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఆయా అభ్యర్థులు భారీ ఎత్తున జనాలను సమీకరించేలా పార్టీ అధినాయకత్వం వారికి ఆదేశాలను జారీ చేసింది. ప్రజాగళం సభల తరువాత ఆయా ప్రాంతాల్లో పార్టీ మైలేజీ ఒక్కసారి పెరిగేలా వ్యూహరచన చేస్తున్నారు. ప్రతి సభల్లోను అక్కడ నెలకొన్న సమస్యలను ఎలుగెత్తి చాటడంతోపాటు తాము అధికారంలోకి వస్తే వాటిని ఎలా పరిష్కరిస్తామన్న విషయాలను కూడా చంద్రబాబు వివరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## శివనామస్మరణతో మానసిక ప్రశాంతత

ఇతిహాస పురాణ చరిత్రలోనే శివదీక్ష ప్రాచుర్యం పొందినట్లు విక్రమాదితున్ని,తామ్ర శాసనం ద్వారా తెలుస్తుంది. వారిలో మొట్టమొదటి భక్తురాలు పార్వతీదేవి, జగన్మాత పార్వతీదేవి చేపట్టి, పరమశివుడి అనుగ్రహం వల్లే అర్ధాంగి అయినది. శివుని శరీరంమదు అర్థం భాగం స్వీకరించుటచే, పరమేశ్వరుడు కూడా అర్ధనారీశ్వరుడు గా మారాడు. కాగా బ్రహ్మ, విష్ణు, ఇంద్రుడు, శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, భక్తకన్నప్ప, పర్వతుడు, భక్త సిరియాలుడు వారు కూడా శివ దీక్షను పాటించారు.కార్తికేయుడు కూడా శివ దీక్షను పూని దేవత సీన్యాలకు అధిపతి అయ్యాడు. ఇంతటి దివ్య మహిమగల శివదీక్ష ఎంతో ప్రాచీనమైనదిగా చెప్పవచ్చు. శివదీక్షతో మోక్ష ప్రాప్తి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్న సంకల్పంతో, లక్షలాదిమంది శివ భక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు. నియమ నిష్ఠలతో దీక్షను పూర్తిచేసి,మార్చి 8న జరిగే మహాశివరాత్రి నాటికి, స్వామివారికి ఇరుముడి సమర్పించేందుకు సన్నతమవుతున్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూర్ గ్రామంలో శివాలయాలు శివనామ స్వరముతో మారుమోగుతున్నాయి. శివ స్వాములు ఆచరించే మండల దీక్ష మానవ జీవన చక్రం పై ఆధారపడి ఉంటుంది. శివ స్వాముల దీక్ష చివరి నాటికి ఇరుముడి ధారణతో శివుడి సన్నిధికి చేరుకుంటారు. శివ స్వాములు ఎక్కువగా పాదయాత్రగా తరలి వెళ్తుంటారు.

# 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

.పాత్రికేయులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు.




నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రం తువ్వ పల్లె సమీపంలోని ఆదర్శ పాఠశాల లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 6వ తరగతి ప్రవేశాలకు సంబంధించి ఈ ఈనెల 3వ తేదీ నుండి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక మోడల్ స్కూల్ రుద్రవరం లో ఐదవ తరగతి స్థాయి సిలబస్ తెలుగు, ఇంగ్లీష్ మీడియం లో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసి, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం రుద్రవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ను, ఉపాధ్యాయ బృందంను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి - డా. చంద్రశేఖర్ రెడ్డి.



శ్రీ ప్రస్థానం న్యూస్ / కోవెలకుంట్ల మార్చి, 2 :- కోవెలకుంట్ల మండలంలో ని అన్ని గ్రామాలలో ఆదివారం మార్చి 3 వ తేదీన 0 - 5 సంవత్సరాల లోపు పిల్లల కు పల్స్ పోలియెా చుక్కలు వేయించుకోవాలని మండల వైద్యాధికారి డా. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేయనుకోని మీపిల్లల బంగారు భవిష్యత్ కు బాట వేయాలని ఆయన తెలిపారు.

## చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించండి

.. మండల వైద్యాదికారి డా. నాగేంద్ర.

శ్రీ ప్రస్థానం న్యూస్ / దొర్నిపాడు, మార్చి 2 :- 0-5 లోపు పిల్లల అందరికి ఆదివారం నాడు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని మండలం వైద్యాధికారి, డా. నాగేంద్ర కోరారు.శనివారము మండలంలోని స్థానిక పి హెచ్ సి.కేంద్రములో పల్స్ పోలియో కార్యక్రమ ఏర్పాట్ల పై సంబంధిత వైద్య సిబ్బంది



తో సమీక్షా సమావేశం నిర్వహించారు.. ఆదివారం జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా సుమారు 1400 మంది ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించడం జరిగిందిని.. వీరందరికీ 18 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.. కావున ఐదేళ్ల లోపు పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించి పిల్లల భవిష్యత్ ను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమానికి వైద్య సిబ్బంది,ప్రజలు తప్పని సరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు...

## తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం టెంకాయ తోపు వద్ద రోడ్డు ప్రమాదం



ఆర్టీసీ బస్సును లారీ ఢీకొని 40 మందికి తీవ్ర గాయాలునెల్లూరు నుంచి తిరుపతికి వెళుతున్న బస్సు బోల్తా 40 మందికి తీవ్ర గాయాలు శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలింపుశ్రీకాళహస్తి వైపు నుంచి నెల్లూరు వైపుకు వెళు తున్న లారీ అతి వేగంగా రావడంతో తప్పించబోయి బస్సు బోల్తాబస్సులో ప్రయాణిస్తున్న సుమారు 40 మంది ప్రయాణికులకు గాయాలుక్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపుఎవరికీ ప్రాణాపాయం లేదనీ సమాచారం...

# పోలమ్మ తల్లి గ్రామానికి సంబంధించిన దేవత అది గుర్తుపెట్టుకోవాలి...

రేలంగి. చందాలు మాత్రం అందరి దగ్గర వి కావాలి.

రాబడి మాత్రం మీ ఒక్క సంఘానికేనా.

ప్రత్యేక దర్శనాల పేరుతో ప్రజల సొమ్ము లూటీ



రాయవరం శ్రీ ప్రస్థానం ప్రతినిధి 2 మార్చి:అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరం మండలం రాయవరంలో కొలువై ఉన్న పోలమ్మ తల్లి ఒక సంఘానిదే కాదని గ్రామానికి చెందిన దేవతని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు రేలంగి నాగేశ్వరరావు అన్నారుశనివారం బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికే సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయవరం మండలం ఎంపీపీ నౌడు వెంకటరమణ పోలమ్మ తల్లి సంబందించి ప్రత్యేక దర్శనాల నిమిత్తం వచ్చే ఆదాయం వారి కుల సంఘానికి మాత్రమే చెందుతుందని గ్రామానికి సంబంధం లేదంటూ వచ్చిన ఆదాయాన్ని స్వాహా చేస్తున్నారని అది తెలిసి ఒక బీసీ సంఘం అధ్యక్షుడిగా వెళ్లి అడగగా నాపై దాడులు చేయడంతో గుడికి సంబంధించిన వివరాలతో హైకోర్టులో పిటిషన్ వేయడం జరిగిందని దానికి సంబంధించి నోటీసులు అందుకోగానే కోర్టులో వేసే సమయంలో సంతకం పెట్టిన తోటి బీసీ సోదరులపై దాడులు చేస్తున్నారని ఒక ప్రజా ప్రతినిధి అయ్యి ఉండి కోర్టును ఆశ్రయించిన వారిపై దాడులు చేయడం అంటే కోర్టు ధిక్కారమే అవుతుందనే విషయాన్ని మర్చిపోతున్నారని నేను బీసీ సంఘం నాయకుడిగా ఎన్నో సమస్యలను నా సొంత సొమ్ముతో వెళ్లి పరిష్కారం చేశానని ఎక్కడా కూడా ఇటువంటి దారుణం చూడలేదని తాను వెళ్లి సమస్య గురించి అడగగా నీవు ఈ ఊరి వాడివి కాదు అంటూ దబాయిస్తున్నారని ఈ ఊరిలో నాకు ఇల్లు ఉంది ఓట్లు కూడా ఉన్నాయి అలాంటప్పుడు నేను ఈ ఊరివాడిని ఎందుకు కాదు అని ఆయన ప్రశ్నించారు? మీరు దాడి చేస్తుండగా తీసిన వీడియోలు ఆధారాలు హైకోర్టులో సమర్పిస్తానని దానికి తగిన మూల్యం మీరు చెల్లించుకోక తప్పదని ఇప్పటికైనా న్యాయస్థానాలను గౌరవించడం తెలుసుకోవాలని మిగతా బీసీ నాయకులు తో చర్చించి త్వరలో నౌడు వెంకటరమణ పై మరి కొన్ని కేసులు పెట్టడం జరుగుతుందని దీనికి మీడియా మిత్రులు కూడా సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు

# ఆరోగ్యశ్రీ కార్డులను త్వరితగతిన పంపిణీ చేయండి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి





కర్నూలు, మార్చి, 02 : ఆరోగ్యశ్రీ కార్డుదారులకు త్వరితగతిన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శనివారం వివిధ ప్రభుత్వ పథకాల అమలు పై అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుదారులకు త్వరితగతిన వాలంటీర్లచే పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ యాప్ ను వాలంటీర్ల చేత డౌన్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 3వ తేదిన పల్స్ పోలియో టీకాల పంపిణీ కార్యక్రమం ఉన్నందున బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో కూడా పల్స్ పోలియో బూత్ లు ఏర్పాటు చేసి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 ద్వారా నిర్వహించే క్యాంపుల గురించి వాలంటీర్ల చేత ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెస్టింగ్ కేంద్రాలను పెంచాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా క్యాట్రాక్ట్ సర్జరీలు అవసరం ఉన్న సర్జరీ చేయించడంతో పాటు కంటి అద్దాలను పంపిణీ చేయాలన్నారు.రీసర్వేకు సంబంధించి సరిహద్దు రాళ్లకు సంబంధించి 25 లక్షల వరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇంకా వాటిలో ఒక లక్ష వరకు సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రానున్న మూడు నెలల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పనులకు వచ్చే వారికి త్రాగు నీరు, మజ్జిగ అందించడంతో పాటు షేడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి పెండింగ్ ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొని రావాలన్నారు. కరువు మండలాలకు ఎప్పటికప్పుడు నీటి సరఫరాను కలెక్టర్లు పర్యవేక్షిస్తూ అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించడం జరిగిందని నిధుల వినియోగం కోసం వర్క్ ఐడి క్రియేట్ చేయడం ద్వారా సదరు నిధులను వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఉద్యమ్ పోర్టల్ ద్వారా యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి గాను సదరు పోర్టల్ లో అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్ఓ మధుసూదన్ రావు, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన



కర్నూలు మార్చి 02:- జిల్లాలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన పల్స్ పోలియో ర్యాలీకి హాజరైన విద్యార్థులకు ప్రజలకు తెలియజేశారు.శనివారం ఉదయం ఈ నెల 03 వ తేదీన ఐదేళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో కార్యక్రమము నిర్వహిస్తున్న సందర్భంగా కలెక్టరేట్ నుండి మెడికల్ కాలేజీ వరకు నిర్వహించిన పల్స్ పోలియో ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన జెండా ఊపి ప్రారంభించారు.×జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 7 గంటలకు మొదలై సాయంకాలం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం గురించి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు మీ పరిసర ప్రాంత ప్రజలకు పల్స్ పోలియోపై అవగాహన కల్పించి పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా చూడాలన్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని రైల్వేస్టేషన్లు, బస్ స్టాండ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బూత్ లలో ప్రజలు తప్పకుండా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. హైరిస్క్ ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన చిన్నారులకు చుక్కల మందును వేయాలని జిల్లా కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, డీఐఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిపిఎంఓ డాక్టర్ ఉమా, డిఈఎంఓ ప్రమీల దేవి, డిప్యూటీ డిఈఎంఓ చంద్రశేఖర్ మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో గల్లంతయిన పలమనేరు విద్యార్థులు

చిత్తూరు,మార్చి2: విహారయాత్రలో విషాదం చోటు చేసుకుంది. ముగ్గురు విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సరదాగా ఎంజాయ్ చేయడానికని తమిళనాడు మహాబలిపురం వద్ద సముద్రానికి వెళ్లారు. సరదాగా జోక్స్ వేసుకుంటూ.. కామెంట్స్ చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇంతలోనే విషాదం. ఉన్నట్టుండి ముగ్గురూ సముద్రంలో గల్లంతయ్యారు. గల్లంతయిన వారిలో బంగారుపాలెం మండలం నల్లగాంపల్లి గ్రామానికి చెందిన విజయ్ కుమార్. మోనిష్ ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## పోలియో నిర్మూలన మనందరి బాధ్యత, పోలియో ఆదివారం పై పార్లపల్లిలో విద్యార్థులతో ర్యాలీ



ఎమ్మిగనూరు గ్రామీణ,మార్చి 02,ఎమ్మిగనూరు మండల పరిధిలోని పార్లపల్లి, గువ్వల దొడ్డి గ్రామాలలో పోలియో నిర్మూలన, పోలియో ఆదివారం పై అయుష్మాన్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ఆధ్వర్యం లో పార్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, గువ్వల దొడ్డి ఉపాధ్యాయులు, సిబ్బంది, ఆయా పాటశాలల విధ్యార్థులు పాల్గొని గ్రామాల్లోని ప్రధాన వీధులలో పోలియో నిర్మూలన మనందరి బాధ్యత, పొలియో చుక్కలు వేయిద్దాం చిన్నారులను కాపాడుదాం అంటూ నినాదాలతో విద్యార్థులతో అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ ఒ)పుష్పరాజ్ మాట్లాడుతూ భారతదేశం లో పోలియో పూర్తిగా నిర్ములించబడిందని,అయినప్పటికీ పక్క దేశాల్లో ఉందికాబట్టి 0 నుండి 5 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వ్యాధి సోకడం వలన పిల్లల్లో అంగవైకల్యం ఏర్పడి,ఇటు చదువుకు, అటు కుటుంబానికి, సమాజానికి భారంగా తయారయ్యే అవకాశం ఏర్పడవచ్చని, అందుకే మన పిల్లల కు మనం బంగారు భవిష్యత్తు ను ఇవ్వాలంటే మనమందరం కలిసి తప్పనిసరిగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజం నిర్మించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, జెడ్పీహెచ్ హైస్కూల్ ఉపాధ్యాయులు జయానంద్, బాబయ్య, ఎర్రిస్వామి,అశాలు బి. లింగమ్మ, రాధమ్మ,మార్తమ్మ, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 04 వ తేదీ న కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం

-స్పందన కార్యక్రమంమండల, డివిజన్,మునిసిపల్ కార్యాలయాల్లో కూడా జగనన్నకు చెబుదాం స్పందన ..ప్రజల నుండి వినతుల స్వీకరణజిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన

కర్నూలు, మార్చి 02 :-ఈనెల 04 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారుజిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.







నగరంలోని ఎక్జిబిషన్ గ్రౌండ్స్ నందు ఇవాళ, నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ళు పథకం లబ్దిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో నగర మేయర్ శ్రీ బి వై రామయ్యగారు, కర్నూల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ ఎం ఏ హఫీజ్ ఖాన్ గారు, శ్రీ ఏ ఎం డి ఇంతియాజ్ గారు, మునిసిపల్ కమిషనర్ శ్రీ ఎ. భార్గవ్ తేజ ఎ.ం.సా., గారు, డిప్యూటీ మేయర్ శ్రీమతి సిద్దారెడ్డి రేణుక గారు, నగర కార్పొరేటర్లు పాల్గొని లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణి చేశారు.

## 5న టిడిపి బిసి డిక్లరేషన్

మాజీమంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి,మార్చి2: టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమం ద్వారా బీసీల అభిప్రాయాలు..ఆలోచనలు తెలుసుకోవడం జరిగిందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ రెడ్డి దుర్మార్గపు పాలనలో దారుణంగా దెబ్బతిన్న బీసీలను రాజకీయంగా.. సామాజికంగా.. ఆర్థికంగా.. విద్యాపరంగా తిరిగి ఉన్నత స్థానాల్లో నిలపాలన్నదే చంద్రబాబు ఆలోచన అని తెలిపారు. బీసీల అభిప్రాయాలు.. చంద్రబాబు ఆలోచనల కలగలుపు టీడీపీ ప్రకటించబోయే బీసీ డిక్లరేషన్ అని చెప్పుకొచ్చారు. మార్చి 5న మంగళగిరి సమీపంలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా జయహో బీసీ మహాసభ సాక్షిగా బీసీ డిక్లరేషన్ను చంద్రబాబు ప్రకటిస్తారని తెలిపారు. బీసీ డిక్లరేషన్ రూపకల్పనకు యనమల రామకృష్ణుడి నేతృత్వంలో టీడీపీ 15 మంది సభ్యుల కమిటీని నియమించిందన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో పాటు బీసీకులగణన నిర్వహణకు సంబంధించిన అంశాల్ని కూడా డిక్లరేషన్లో ప్రకటిస్తామన్నారు. జయహో బీసీ డిక్లరేషన్ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచీ బీసీలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీసీ సోదరుల నినాదాలతో తాడేపల్లి ప్యాలెస్ కంపించాలని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757